క్లుప్తంగా

28న 'మనూ'లో సెమినార్

రాయదుర్గం : మనూ ఇస్లామిక్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీ జాతీయ సెమినార్‌ను నిర్వహించనున్నట్లు విభాగాధిపతి ప్రొఫెసర్ మహ్మద్ ఫహీమ్ అక్తర్ శుక్రవారం తెలిపారు. ఇస్లామిక్ ఫిఖ్ అకాడమీ ఇండియా(ఐఎఫ్ఏఐ) సహకారంతో 'ఇండియన్ నాన్ ముస్లీంమేతర ఇస్లామిక్ స్టడీస్' అనే అంశంపై ఈ సెమినార్ జరుగుతుందన్నారు

ప్రశాంతంగా విద్యార్థి సంఘ ఎన్నికలు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థి సంఘం 2022–23 ఎన్నికలు శుక్రవారం నిర్వహించారు. ఈ ఎన్నికలలో 5,300 మంది విద్యార్థులు ఓట్లు వేశారు. క్యాంపస్‌లో శనివారం ఓట్ల లెక్కింపు చేయనున్నారు. ఏబీవీపీ, ఓబీసీఎఫ్, ఎస్ఎల్‌వీడి విద్యార్థి సంఘాలు ఒక కూటమిగా, ఏఎస్ఏ, డీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ మరో కూటమిగా, అలయన్స్ ఫర్ సోషల్ డెమొక్రసీ పేరిట బీఎస్ఎఫ్, ఫ్రెటర్నిటీ, ఎంఎస్ఎఫ్, ఎన్ఎస్‌యూఐ, టీఎస్ఎఫ్ ఇంకో కూటమిగా దిగాయి. వీటికి పోటీగా వైఐఎస్ఎస్ విద్యార్థి సంఘం కూడా పోటీలో ఉంది.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం


లబ్ధిదారులకు ఎల్ఓసీ అందజేస్తున్న కార్పొరేటర్ నర్సింహయాదవ్

ఓల్డ్‌బోయిన్‌పల్లి: ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం లాంటిదని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అన్నారు. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి శుక్రవారం మంజూరైన ఎల్ఓసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్)ను రోగుల బంధువులకు ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బుర్రి యాదగిరి, ఉదయ్, సలీం, అజీమ్, మహమ్మద్ జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా ఐఎన్‌టీయూసీ సెక్రటరీగా భాస్కర్‌రెడ్డి



ఆల్విన్‌కాలనీ: ఆల్ ఇండియా ఐఎన్‌టీయూసీ సెక్రటరీగా వి.భాస్కర్‌రెడ్డి నియమితులయ్యారు. ఆల్ ఇండియా ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యవర్గ సమావేశంలో శుక్రవారం అధ్యక్షుడు సంజీవరెడ్డి చేతుల మీదుగా ఆయన నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ... తనపై నమ్మకం ఉంచి పదవిని ఇచ్చినందుకు సంజీవరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్మికుల వెన్నంటే ఉంటూ వారికి చట్టబద్ధంగా దక్కాల్సిన హక్కుల కోసం పోరాడతానన్నారు. ఈ కార్యక్రమంలో నాగన్నగౌడ్, నరసింహారెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్‌లోని పెండింగ్ పనులు పూర్తి చేయాలి

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పెండింగ్‌లో ఉన్న కమ్యూనిటీ భవనాలు, గ్రంథాలయాలు, బస్తీ దవాఖానాలు వెంటనే పూర్తి చేయాలని సీపీఐ నాయకులు శుక్రవారం మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాచుపల్లి మండల సీపీఐ కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ మాట్లాడుతూ... 31, 32, 33 డివిజన్లలో కమ్యూనిటీ భవనాలకు శంకుస్థాపనలు చేసి సంవత్సరం పూర్తి కావస్తున్నా పనులు ముందుకు సాగడం లేదన్నారు. ఇక బస్తీ దవాఖానాలు, గ్రంథాలయ భవన నిర్మాణాలను నత్తనడకన కొనసాగుతున్నాయని ఆరోపించారు. శనివారం జరగబోయే నిజాంపేట్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో పెండింగ్ పనులపై తీర్మానం చేసి వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆధార్ అప్‌డేట్ చేసుకోండి

సుభాష్‌నగర్: ఆధార్‌కార్డ్ తీసుకుని 10 సంవత్సరాలు పూర్తయిన ప్రతి ఒక్కరూ తమ వివరాలను అప్‌డేట్ చేసుకోవాలని మీసేవ సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి దయాసాగర్ గుప్తా ఓ ప్రకటన తెలిపారు. 2015 అంటే ముందు ఆధార్ పొందిన వారు పదోతరగతి మెమో, పాన్ కార్డు, ఓటర్ గుర్తింపు కార్డు, పాస్‌పోర్టులలో ఏదో ఒకటి జతపరిచి అప్‌డేట్ చేసుకోవాలన్నారు. ఇందుకుగాను సూరారంలోని కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో శని, ఆదివారాల్లో ప్రత్యేక క్యాంపు ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు ఫోన్ నం.9397012873లో సంప్రదించాలని కోరారు.

ప్రశ్నించే గొంతుకను గెలిపించండి

సాక్షి, సిటీబ్యూరో: శాసన మండలిలో ప్రశ్నించే గొంతుకను గెలిపించాలని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఉమ్మడి సంఘాల అధ్యాపక ఎమ్మెల్సీ అభ్యర్థి ఏవీఎన్ రెడ్డిని గెలిపించాలని పట్టణంలోని జెడ్పీ బాలికలు, జెడ్పీ అవుషాపూర్, అంకుషాపూర్, ఎదులాబాద్, ఎన్ఎఫ్‌సీనగర్ కేవీ స్కూళ్లలో శుక్రవారం ప్రచారం చేశారు. ఈ ప్రచారంలో సత్యనారాయణ, రామలింగారెడ్డి, జోగారావు, దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

నాలాను మూసేసి ఫుట్‌పాత్ నిర్మాణం

వర్షపునీరు ఎలా వెళ్తుందని ఆందోళనలో స్థానికులు




గూడ్స్ షెడ్ రోడ్డులో మూసివేయకుండా ఉన్న ఓపెన్ నాలా


యాదవ బస్తీ నుంచి వచ్చే నీరు వెళ్లకుండా ఎత్తులో ఉన్న గూడ్స్ షెడ్ రోడ్డు

మూసాపేట: వర్షపు నీరు సాఫీగా వెళ్లే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలే గానీ నాలాలను మూసేసి ఫుట్‌పాత్ నిర్మాణం చేపట్టిన అధికారుల వింత ప్రవర్తనకు స్థానికులు నివ్వెర పోతున్నారు. ముంపుకు గురి కాకుండా కొన్ని సంవత్సరాల క్రితం ఓపెన్ నాలాను నిర్మించారు. ప్రస్తుతం ఆ నాలాను అధికారులు మూసేసి ఫుట్‌పాత్‌ను నిర్మిస్తున్నారు. వర్షపు నీరు ఎలా వెళ్తుందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

◆ మూసాపేటలోని యాదవ బస్తీ, ముష్కిపేట, జనతానగర్, జిల్లా బస్తీ, యాదవ బస్తీ ప్రాంతాల నుంచి వర్షపునీరు, డ్రైనేజీ నీరు సాఫీగా వెళ్లేందుకు గూడ్స్ షెడ్ రోడ్డులో గత కొన్ని సంవత్సరాల క్రితం ఓపెన్‌నాలాను నిర్మించారు.

◆ తరువాత జనాభా పెరగడంతో డ్రైనేజీ నీరు వెళ్లేందుకు భూగర్భ డ్రైనేజీ లైన్ వేయడంతో వర్షాకాలంలో వర్షపు నీరు మాత్రమే వెళ్లే విధంగా ఆ నాలా ఉండేది.

◆ జనతానగర్, యాదవ బస్తీ నుంచి వచ్చే వర్షపు నీటికి గూడ్స్ షెడ్ రోడ్డుకు పల్లపు ప్రాంతంగా ఉంటంతో నీరు వేగంగా వచ్చి నాలాలో కలిసేది. అక్కడి నుంచి గూడ్స్ షెడ్ వద్ద ఉన్న హుస్సేన్ సాగర్‌కు వెళ్లే ఓపెన్ నాలాలో కలిసేది.

◆ బస్తీలో నుంచి వచ్చే నీరు గూడ్స్ షెడ్ రోడ్డులోకి వెళ్లే అవకాశం కూడా లేదు. రోడ్డు ఎత్తుగా ఉండటంతో పరిసర ప్రాంతాల్లోని ఇళ్లలోకి నీరు వెళ్లే అవకాశం వుంది.

◆ చిన్నపాటి వర్షం వచ్చినా ఇళ్లల్లోకి నీరు వస్తున్నాయి. ఇంకా పెద్ద పెద్ద వానలు వస్తే ఇళ్లు మునిగిపోవడం ఖాయమని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

◆ రెండు సంవత్సరాల క్రితం కురిసిన వానకు ఇళ్లలోకి నీరు రావడమే కాకుండా గోదాముల్లోకి నీరు చేరడం... ప్రజలు వదరల్లో చిక్కుకు పోయారు. ఆ సంఘటన తెలిసిన అధికారులు చర్యలు తీసుకోకుండా నాలాను మూసేసినా పట్టించుకోకుండా ఫుట్‌పాత్ నిర్మించడం అనుమానాలకు తావిస్తోంది.

◆ నాలాను మూసివేయడంతో చిన్నపాటి వర్షాలకు ముంపుకు గురయ్యే అవకాశం ఉంది. మూసుకుపోయిన నాలాను సరి చేయాల్సిన అధికారులు నాలాపై ఫుట్‌పాత్ నిర్మించడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

◆ ఇక్కడ నాలాను కొద్ది ప్రాంతం వరకు మూసివేసి ఫుట్‌పాత్ నిర్మించారు. మిగతా ప్రాంతం ఓపెన్ నాలా మూసుకుపోతున్నాయి. కానీ కనీసం అక్కడ ఫుట్‌పాత్‌లు నిర్మించారు. అక్కడే నాలాను నిర్మించి ఫుట్‌పాత్‌లు నిర్మించడం వెనుక రహస్యం ఏమిటని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

“ చర్యలు తీసుకోవాలి...



నాలాను మూసివేయడంతో వర్షాలకు మా ఇళ్లలోకి నీరు చేరే అవకాశం ఉంది. అక్కడ మాత్రమే నాలాను పూడ్చివేసి ఫుట్‌పాత్‌లు ఎందుకు నిర్మిస్తున్నారు.? వర్షపునీరు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలి.

– శ్రీనివాస్, స్థానికుడు

శ్మశానవాటిక నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయాలి


హైదర్‌నగర్‌లోని హిందూ శ్మశానవాటికను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

కూకట్‌పల్లి: హైదర్‌నగర్‌లోని హిందూ శ్మశానవాటికలో తక్షణమే అన్ని సదుపాయాలు కల్పించి అందుబాటులోకి తీసుకురావాలని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ నాయకులు మాట్లాడుతూ... ఇప్పటికే అనేక మార్లు అధికారులను కలిసి వినతిపత్రాల ద్వారా హిందూ శ్మశానవాటిక విషయమై విజ్ఞప్తులు చేశామని తెలిపారు. అప్పటి మేయర్‌గా ఉన్నటువంటి బొంతు రామ్మోహన్, కలెక్టర్‌లకు వినతిపత్రాలు అందజేశారన్నారు. ఆ తర్వాత కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ వి.మమతకు సైతం వినతిపత్రం అందజేసి సమస్యను వివరించామన్నారు.

◆ ఈ సమస్యను త్వరలో పరిష్కరిస్తానని ఆమె హామీ ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆ తర్వాతనే ఈ శ్మశానవాటిక నిర్మాణ పనుల్లో కదలిక ఏర్పడిందన్నారు. ఇప్పటికీ 10 శాతం పనులు పూర్తి అయ్యాయని తెలిపారు. త్వరగా అన్ని పనులు పూర్తి చేసి, శ్మశానవాటికలో మౌలిక వసతులు కల్పించి అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. అనేక పోరాటాల తరువాత హైదర్‌నగర్ బస్‌స్టాప్ ప్రాంతంలో సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, సాదా మహేష్, మహేష్ గౌడ్, బి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గచ్చిబౌలిలో ట్రాఫిక్ మళ్లింపు

భారీ వాహనాల రాకపోకలపై ఆంక్షలు

గచ్చిబౌలి: గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ మళ్లింపు, భారీ వాహనాల రాకపోకలపై ఆంక్షలు ఉంటాయని సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ నారాయణ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం గచ్చిబౌలి స్టేడియంలో ప్రముఖ సంగీత దర్శకులు ఇళయరాజా లైవ్ కన్సర్ట్‌కు 17,520 మంది హాజరయ్యే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ట్రాఫిక్ మళ్లింపు ఉంటుందన్నారు. లింగంపల్లి నుంచి గచ్చిబౌలి జంక్షన్‌కు వచ్చే వాహనాలను హెచ్‌సీయూ బస్ డిపో వద్ద ఎస్ఎంఆర్ వినయ్‌సిటీ, మసీద్‌బండ, బొటానికల్ గార్డెన్, గచ్చిబౌలి వైపు వెళ్లాల్సి ఉంటుంది. గచ్చిబౌలి సర్కిల్ నుంచి లింగంపల్లికి వెళ్లే వాహనాలు బొటానికల్ గార్డెన్, మసీద్‌బండ, హెచ్‌సీయూ బస్ డిపో వైపు వెళ్లాల్సి ఉంటుందన్నారు. రాయదుర్గం నుంచి లింగంపల్లి వైపు వచ్చే వాహనాలను ట్రిపుల్ ఐటీ జంక్షన్ నుంచి గోపీచంద్ అకాడమీ, విప్రో సర్కిల్, క్యూసిటీ, గోపన్‌పల్లి, నల్లగండ్ల ఫ్లై ఓవర్ నుంచి వెళ్లాలన్నారు. లింగంపల్లి నుంచి గచ్చిబౌలి జంక్షన్, గచ్చిబౌలి నుంచి లింగంపల్లి వైపు భారీ వాహనాల రాకపోకలపై నిషేధం విధించినట్లు పేర్కొన్నారు. ట్రక్కులు, లారీలు, వాటర్ ట్యాంకర్లు, డీసీఎంలు, ఆర్ఎంసీ వాహనాలపై ఆంక్షలు ఉంటాయన్నారు. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించి ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని కోరారు.

అధ్వానంగా రోడ్లు.. ప్రజలకు ఇబ్బందులు


మల్లికార్జుననగర్ రోడ్ నం.3లో అధ్వానంగా మారిన రహదారులు

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ మల్లికార్జుననగర్ రోడ్ నం.3లోని ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. నెలలు గడుస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పీవీ ఎన్‌క్లేవ్, సమతానగర్, గౌరినగర్ ప్రాంతాలతో పాటు బోయిన్‌పల్లి మార్కెట్, సికింద్రాబాద్‌కు వెళ్లాలంటే ఇదే ప్రధాన దారి. దీంతో నిత్యం వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా తెలంగాణ మైనార్టీ స్కూల్ నుంచి టీచర్స్ కాలనీ వరకు ఉన్న రోడ్డు గుంతలమయంగా మారింది. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

రాజ్యాంగంలో న్యాయం,స్వేచ్ఛకు ప్రాధాన్యం

సుప్రీంకోర్టు విశ్రాంత జడ్జి జస్టిస్ చలమేశ్వర్


సమావేశంలో మాట్లాడుతున్న సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జే. చలమేశ్వర్

రాయదుర్గం: రాజ్యాంగంలో పొందుపర్చిన న్యాయం, స్వేచ్ఛ ప్రాముఖ్యతను సుప్రీంకోర్టు విశ్రాంత జడ్జి జస్టిస్ జే చలమేశ్వర్ వివరించారు. శుక్రవారం గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో అల్లాడి స్మారక ఉపన్యాస కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌లోని నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా వీసీ ప్రొఫెసర్ శ్రీకృష్ణదేవ రావు అధ్యక్షతన నిర్వహించిన సదస్సుల '75 ఏళ్ల భారత న్యాయవ్యవస్థ, దాని స్వాతంత్ర్యం, సమర్థత' అనే అంశంపై చలమేశ్వర్ మాట్లాడారు. రాష్ట్రంలో కార్యనిర్వాహక, శాసనసభ, న్యాయవ్యవస్థ వంటి వివిధ శాఖల మధ్య అధికార పంపిణీని ఆధునిక ప్రజాస్వామ్యాలు ఎలా నిర్ధారిస్తున్నాయనే దాని గురించి వివరించారు. కొలీజియం వ్యవస్థపై ఆయన వ్యాఖ్యానిస్తూ దానికి అవసరమైన పారదర్శకత లోపించిందన్నారు. అనంతరం విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానాలిచ్చారు.

విద్యుత్ పెండింగ్ పనులన్నీ పూర్తి చేయాలి


విద్యుత్ పనులపై ఏఈ శ్రీనివాస్, బస్తీ అధ్యక్షులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సబిహా

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్‌లో ఎలక్ట్రికల్ పనుల గురించి శుక్రవారం ఏఈ శ్రీనివాస్, అయ్యప్ప సొసైటీ సెక్షన్‌కి వచ్చేటువంటి బస్తీలైన పండిట్ నెహ్రూనగర్, అల్లాపూర్, కేఎస్‌నగర్, పర్వత్‌నగర్, వివేకానందనగర్ బస్తీ అధ్యక్షులతో స్థానిక కార్పొరేటర్ సబిహా బేగం సమావేశమయ్యారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేయాలన్నారు. వాటికి తగిన కేబుల్స్, కొత్త పోల్స్ వేయాలని ఆదేశించారు. ప్రజలకు విద్యుత్‌కు సంబంధించిన వోల్టేజ్ సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ పెండింగ్ పనులన్నీ త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జగన్, రవీందర్‌రెడ్డి, కొండల్ రెడ్డి, ఇస్మాయిల్, శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్ రెడ్డి, నజీర్, నూర్, చాంద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని సాగనంపడం ఖాయం

రాయదుర్గం: నానక్‌రాంగూడలో ప్రజాగోస–బీజేపీ భరోసా కార్నర్ సమావేశం శుక్రవారం నిర్వహించారు. శక్తి కేంద్ర ఇన్‌చార్జీలు మీన్‌లాల్‌సింగ్,సంతోష్‌సింగ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్, గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలన నడుస్తోందని విమర్శించారు. ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్‌భారత్, ముద్ర యోజన, తదితర పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బీజేపీ నాయకులు హన్మంతునాయక్, నర్సింహారావు, వరలక్ష్మి, కిషన్, శివాసింగ్, శ్రీకాంత్‌రెడ్డి, బబ్లూసింగ్ పాల్గొన్నారు.

మస్తాన్‌నగర్‌లో..

గచ్చిబౌలి: ప్రజల గోస పట్టని బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని సాగనంపడం ఖాయమని బీజేవైఎం రాష్ట్ర కోశాధికారి ఎం రఘునాథ్‌యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం కొండాపూర్ డివిజన్ మస్తాన్‌నగర్‌లో బీజేపీ కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ మహానగరానికి మకుటం లాంటి హైటెక్‌సిటీకి ఆనుకొని ఉన్న కాలనీ మస్తాన్‌నగర్ అభివృద్ధికి ఆమడదూరంలో ఉందన్నారు.

కార్మికులకు వారాంతపు సెలవులు ఇవ్వాలి

ఏఐటీయూసీ డిమాండ్

కుత్బుల్లాపూర్: పారిశుద్ధ్య కార్మికులకు వారాంతపు సెలవులు ఇవ్వకుండా వెట్టి చాకిరి చేయిస్తున్నారని మేడ్చల్ జిల్లా ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయచంద్ర అన్నారు. శుక్రవారం కొంపల్లి మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులతో సమావేశమైన ఏఐటీయూసీ నాయకులు వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జయచంద్ర, జిల్లా అధ్యక్షుడు రాములు, కుత్బుల్లాపూర్ కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ.. కొంపల్లి మున్సిపాలిటీలో పనిచేసే పారిశుద్ధ్య సిబ్బందికి సెలవులు ఇవ్వకుండా కాంట్రాక్టర్ కార్మిక చట్టానికి వ్యతిరేకంగా వెట్టిచాకిరి చేయిస్తున్నాడని అన్నారు. తక్షణమే వారాంతపు సెలవు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే సమ్మెకు దిగుతామని హెచ్చరించారు.

◆ అదే విధంగా కార్మికులకు సంబంధించి ఈఎస్ఐ, పీఎఫ్ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం వాతాంతపు సెలవుల విషయమై కొంపల్లి కమిషనర్‌కు వినతి పత్రం ఇవ్వగా ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో కార్మిక యూనియన్ నాయకులు నాగయ్య, పోచమ్మ, లక్ష్మి, మోహన్, సుహాసిని, లక్ష్మణ్, సూపర్‌వైజర్ కిషన్, దశరథ, కార్మికులు పాల్గొన్నారు.

హైదరాబాద్ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్ విజేత టీం మైసా



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్ మూడో సీజన్లో టీం మైసా విజేతగా నిలిచింది. బ్యాంకాక్ లో జరిగిన ఫైనల్స్‌లో టీం మైసా 5.5–2.5 స్కోర్ తో టీమ్ స్వాన్స్‌పై విజయం సాధించింది. టైటిల్ పోరులో తొలి నాలుగు గేమ్స్‌లోనూ టీం మైసా విజయం సాధించి ఆధిక్యంలో నిలిచింది. అయితే తర్వాతి రెండు గేమ్స్‌లో టీమ్ స్వాన్స్ పుంజుకోవడంతో మ్యాచ్ ఆసక్తికరంగా మారింది. ఈ దశలో చివరి రెండు గేమ్స్‌లో మరోసారి టీం మైసా ఆధిపత్యం కనబరిచి టైటిల్ కైవసం చేసుకుంది. ఫైనల్స్‌లో టీమ్ మైసా ఓనర్స్ దీపక్, శ్వేత చక్కని ఆటతీరుతో ఆకట్టుకున్నారు. కాగా హైదరాబాద్ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్ మూడో సీజన్‌లో ఛాంపియన్ గా నిలవడం సంతోషంగా ఉందని, లీగ్‌ను అద్భుతంగా నిర్వహించారని టీమ్ మైసా ఓనర్ దీపక్ చెప్పారు. బ్యాంకాక్ రాయల్ జెమ్స్ గోల్ఫ్ కోర్స్‌లో ఫైనల్స్ ఆడడం కొత్త అనుభూతి ఇచ్చిందని తెలిపారు.

కుత్బుల్లాపూర్ అభివృద్ధికి కృషి చేస్తున్నాం

ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. ప్రగతియాత్రలో భాగంగా శుక్రవారం ఆయన జీడిమెట్ల డివిజన్ పరిధిలోని గోదావరి హోమ్స్, ప్రశాంత్‌నగర్, వెన్నెలగడ్డ తదితర ప్రాంతాల్లో పాదయాత్ర చేపట్టి స్థానికంగా నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే వాటికి ప్రతిపాదనలు సిద్ధం చేయించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అదే విధంగా గోదావరి హోమ్స్‌లో రూ.69 లక్షలతో చేపడుతున్న ఎస్ఎన్‌డీపీ నాలా పనులు, రూ.40 లక్షలతో పార్కు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, ఆయా కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, కాలనీల ప్రజలు పాల్గొన్నారు.

జనాభాకు అనుగుణంగా యూజీడీ పైపులైన్ల ఏర్పాటు


హస్మత్‌పేట బడే మసీదు చేపట్టిన పనులపై కాంట్రాక్టర్‌కు సూచనలు చేస్తున్న జలమండలి మేనేజర్ తేజ

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో జనాభాకు అనుగుణంగా డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని జలమండలి మేనేజర్ తేజ తెలిపారు. హస్మత్‌పేట బడే మసీదు రహదారిలో నూతనంగా చేపట్టిన పైపులైన్ పనులను శుక్రవారం జలమండలి డీజీఎంతో కలసి ప్రారంభించారు. పనుల్లో జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. లేని పక్షంలో తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఎక్కడెక్కడ డ్రైనేజీ సమస్యలు తలెత్తుతున్నాయో అక్కడ జనాభాకు అనుగుణంగా పైప్‌లైన్ల సామర్థ్యాన్ని పెంచుతామని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు.

వీఎన్ఆర్ వీజేఐఈటీలో 'హాల్ట్ ప్రైజ్' చాలెంజ్

నిజాంపేట్: బాచుపల్లిలోని వీఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (వీఎన్ఆర్ వీజేఐఈటీ) కళాశాలలో శుక్రవారం 'హాల్ట్ ప్రైజ్'చాలెంజ్ జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన 120 మంది విద్యార్థులు 38 జట్లుగా పోటీ పడనున్నాయి. ఈ చాలెంజ్‌కు సామాజిక కార్యకర్త, డిజైనర్ నిహారికారెడ్డి, హాట్‌నాట్ అంకురసంస్థ వ్యవస్థాపకుడు ఫ్రెడెరిక్ దేవరంపాటి, క్లైమేట్ రియాల్టీ ప్రాజెక్ట్స్ ప్రతినిధి అంతరాచౌదరి, వీఎన్ఆర్ వీజేఐఈటీ ఇన్నోవేషన్ కౌన్సిలర్ కన్వీనర్ డాక్టర్ కిరణ్ చక్రవర్తుల విజేతనిర్ణేతలగా వ్యవహరించనున్నారు.

◆ రీడిజైనింగ్ ఫ్యాషన్ ఇన్ ఏ సస్టైనబుల్ వే ఇతివృత్తంగా ఈ చాలెంజ్ జరుగనుంది. ఈ చాలెంజ్‌లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన జట్లను ముంబాయిలో జరిగే మధ్య, దక్షిణాసియా ప్రాంతీయ స్థాయి పోటీలకు పంపుతామని సమన్వయకర్తలు డాక్టర్ వెంకటేశ్వరరావు, చేకూరి శ్రీసుమంత్ తెలిపారు. సమాజహితాన్ని, పర్యావరణ హితాన్ని దృష్టిలో పెట్టుకుని పరిష్కారాలు రూపొందించటమే లక్ష్యంగా ఈ చాలెంజ్‌ను రూపకల్పన చేశామని ప్రిన్సిపాల్ డాక్టర్ సీడీ నాయుడు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ఎవరైనా అంకుర సంస్థగా తీర్చిదిద్దాలనుకుంటే తమ ఇంక్యూబేటర్ 'విజే హబ్'ద్వారా సహకారాన్ని అందిస్తామని సంచాలకులు డాక్టర్ బి.చెన్నకేశవరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సమన్వయకర్త, హాల్ట్ ప్రైజ్ కూటమి క్యాంపస్ డైరెక్టర్, బెజుగం రిషబ్‌గుప్తా, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్ రాష్ట్రంలో అమలు చేయడం లేదు

నిజాంపేట్: ఆయుష్మాన్ భారత్ లాంటి కేంద్ర ప్రభుత్వ పథకాలను బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేయడం లేదని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. ప్రజాగోస – బీజేపీ భరోసాలో భాగంగా గురువారం రాత్రి నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని ఇందిరనగర్, దుండిగల్ మున్సిపల్ పరిధిలోని డీ–పోచంపల్లిలలో స్ట్రీట్ కార్నర్ మీటింగ్ నిర్వహించారు. శక్తి కేంద్రాల ఇన్‌చార్జ్‌లు రాముగౌడ్, రామచందర్‌నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి శ్రీశైలంగౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను రాష్ట్రంలో అమలు చేయకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆరోపించారు. సీఎం కేసీఆర్ ఎన్ని జిమ్మిక్కులు చేసినా తెలంగాణాలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని జోస్యం చెప్పారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నుంచి సుమారు 50 మంది కార్యకర్తలు, యువకులు శ్రీశైలంగౌడ్ సమక్షంలో బీజేపీలో చేరారు.

బీవీఆర్ఐటీలో 'మేధాన్వేష్'

నిజాంపేట్: బాచుపల్లిలోని బీవీఆర్ఐటీ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం జాతీయ స్థాయి విద్యార్థుల సాంకేతిక ఉత్సవం 'మేధాన్వేష్–2023'ఘనంగా ప్రారంభమైంది. డైరెక్టర్ ఆఫ్ ఇంజినీరింగ్, ఎక్స్‌పీరియన్స్ సృజన శ్రీవాస్తవ, ఐఐటీ హైదరాబాద్ ఆచార్యులు డాక్టర్ నిమ్మి రంగస్వామిలు ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా నేడు అనేక రంగాల్లో మహిళల ప్రాతినిధ్యం పెరిగిందన్నారు. సాంకేతికతను ఉపయోగించుకుని అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీఎన్ సునీత మాట్లాడుతూ... విద్యార్థులు తమ సాంకేతిక నైపుణ్యాలను ప్రదర్శించడానికి ప్రతి ఏటా మేధాన్వేష్‌ను నిర్వహిస్తున్నామని అన్నారు. గెలుపోటములకు సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా పాల్గొనాలని కోరారు. రెండు రోజుల పాటు జరిగే ఈ మేధాన్వేష్‌లో జరిగే విభిన్న సాంకేతిక పోటీల గురించి మేధాన్వేష్ కన్వీనర్ డాక్టర్ అన్వర్ బాషాపఠాన్ వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

మొగులమ్మ కాలనీ డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తా


మొగులమ్మకాలనీలో పర్యటిస్తూ సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: పీజేఆర్‌నగర్ పరిధిలోని మొగులమ్మకాలనీలో రోడ్లు, డ్రైనేజీ సమస్యలు ఉన్నాయని స్థానికులు శుక్రవారం ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన ఆ ప్రాంతంలో పర్యటించి సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. వెంటనే జలమండలి అధికారులతో మాట్లాడి సమస్యను పరిశీలించాలని అధికారులకు ఆదేశించారు. అదే విధంగా సీసీ రోడ్ల నిర్మాణానికి అయ్యే ఖర్చును రాసి ఇవ్వాలన్నారు. ఎన్‌టీఆర్‌నగర్ వాటర్‌ట్యాంక్ వద్ద వీధిలో నూతనంగా నిర్మించాల్సిన డ్రైనేజీ, సీసీ రోడ్డుకు కూడా ఎస్టిమేషన్ వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దొడ్ల రామకృష్ణగౌడ్, ఎస్సీసెల్ అధ్యక్షుడు జాన్, షౌకత్ అలీ మున్నా, పోశెట్టిగౌడ్, శామ్యూల్, మహేష్, జావిద్, విజయ్, ఈశ్వరయ్య, నయీం తదితరులు పాల్గొన్నారు.